ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బాబుకు లేదు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): రాయలసీమ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని, ఆయన అధికారంలో ఉన్నంత వరకు కల్లబొల్లి మాటలతో మాయ చేశారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పెనుమూరులో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జగనన్న సురక్ష పథకంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాయలసీమలోని బీడు భూములు నేడు పచ్చని పంట పొలాలతో కళకళలాడుతున్నాయంటే అది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువేనన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును తన ఖజానాగా వాడుకుంటూ ప్రజలకు గ్రాఫిక్స్ చూపించి నమ్మించాడని దుయ్యబట్టారు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఉపాధ్యాయుడిలా బోర్డుపై కాకి లెక్కలు చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గానికి తాగునీరు అందించలేని చంద్రబాబు ప్రాజెక్టులన్నీ తానే నిర్మాణం చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేడు తండ్రీకొడుకులు అధికారం కోసం రోడ్లపై పడి పొర్లుదండాలు పెడుతున్నారని అన్నారు. అయినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అయనకు ఎల్లో మీడియా తోడై సంక్షేమం, అభివృద్ధి పనులపై విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమీపిస్తుండడంతో చంద్రబాబు, లోకేష్, టీడీపీ నాయకులు పగటి వేషగాళ్ల అవతారమెత్తి మోసపూరిత హామీలతో నమ్మించేందుకు చూస్తారని.. ప్రజలు గమనించాలని కోరారు.

అన్ని వర్గాలు హర్షించేలా పాలన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని అన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. పేదల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న నవరత్నాలను పలు రాష్ట్రాల్లో అమలు చేసేందుకు, ఆయా రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రంలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారని అన్నారు. సచివాలయాలు, ఆర్బీకేల ఏర్పాటుతో ప్రజలు తమ సొంత గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు పొందుతున్నారన్నారు.

సులభతరంగా ధ్రువపత్రాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కింద ఉచితంగా ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండల కేంద్రాలకు వెళ్లి కార్యాలయాల చుట్టూ తిరిగినా వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. నేడు సొంత ఊర్లలోనే 11 రకాల ధ్రువపత్రాలు సులభంగా పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుండరీనాథ్, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు యశోదారెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచ్ రమేష్, యతీశ్వర్‌నాయుడు, దూది మోహన్ పాల్గొన్నారు.

వృద్ధులకు అండ



జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటే ఎవరికీ కష్టాలు ఉండవు. నా కన్న బిడ్డలు నన్ను వదిలేసినా ముఖ్యమంత్రి సమయానికి పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారు. అలాంటి కొడుకు ఉంటే బావుండేది. నా లాంటి ఎందరో వృద్ధులకు పింఛన్ అందజేసి ఆదుకుంటున్నారు. ఆయన్ను ఆ దేవుడు చల్లగ చూడాలా. నా లాంటి అనాథలకు అండగా నిలబడాలి. -నారాయణమ్మ (75), పెనుమూరు

క్లుప్తంగా

జయేంద్ర సరస్వతి జయంతి వేడుకలు


అలంకరణలో కంచి పీఠాధిపతులు

నగరి: కీళపట్టు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురువారం కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి జయంతి వేడుకలు, ఆడిపెరుక్కు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతుల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించారు. ఆడిపెరుక్కు ఉత్సవం కొలనులు, చెరువుల్లో నీటి వృద్ధికి ప్రత్యేకం కావడంతో ఆలయ కొలనులో జలాభిషేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు జలగడం సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాము కాటుకు పాడిఆవు మృతి



శ్రీరంగరాజపురం: పాము కాటుకు పాడిఆవు మృతి చెందిన ఘటన మండలంలోని పద్మపురం దళితవాడలో చోటుచేసుకుంది. తమ పొలంలో ఆవు మేత మేస్తుండగా పాటు కాటుకు గురై మరణించినట్లు బాధిత రైతు చిన్నయ్య తెలిపారు. పాడి ఆవుపై ఆధారపడి తమ కుటుంబం జీవనం సాగిస్తోందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పోలీసుల మాక్‌డ్రిల్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల మాక్‌డ్రిల్ గురువారం సైతం కొనసాగింది. కల్లూరు, ట్రాఫిక్, డీసీఆర్‌బీ, డీటీసీ, దిశ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందికి వృత్యంతర శిక్షణపై అవగాహన కల్పించారు. మూడు రోజులుగా పోలీసులకు ఇక్కడ మాక్‌డ్రిల్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: ముస్లిం విద్యార్థులకు ఉర్దూ అకాడమీలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుసేన్ తెలిపారు. ఆయన విలేకరులతో గురువారం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సీబీ రోడ్డులో ఉన్న ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీలో కంప్యూటర్ శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే వారు పదవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి అనంతరం తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9441588344, 7386588908, 8688498322 ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

శ్రీనివాస సేతు పెండింగ్ పనులు పూర్తి చేయండి



తిరుపతి తుడా: శ్రీనివాససేతు పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె గురువారం శ్రీనివాససేతు నిర్మాణ పనులు, తనపల్లి కూడలిలోని కాస్టింగ్ యాడ్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సెగ్మెంట్ ప్రమాదం కారణంగా పనులు ఆగిపోయాయని తెలిపారు. పగలిపోయిన సెగ్మెంట్ స్థానంలో మరొకటి పూర్తి చేసి త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఫట్‌పాత్, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆఫ్కాన్స్ ప్రతినిధులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

క్షుణ్ణంగా ఓటర్ల సర్వే


జేసీ వీడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులు

గంగాధరనెల్లూరు: ఓటర్ల జాబితాను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలు, తహసీల్దార్, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటరు నమోదులో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్వోలు ప్రత్యేక రికార్డు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ ఇన్బనాథన్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యసనా సామగ్రి వితరణ


అభ్యసనా సామగ్రి అందిస్తున్న దాత

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత చంద్రయ్య అభ్యసనా సామగ్రి వితరణగా అందించారు. గురువారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, బాక్సులు అందించారు. దాతకు ప్రధానోపాధ్యాయులు గీతా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరత్నం, మహేష్, సామా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం: రక్తహీనత రాకుండా విద్యార్థినులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోహన్ క్రిష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కౌమార దశలో బాల, బాలికల్లో వచ్చే మార్పులను వివరించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్ సుశీల విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు మింగించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండలంలోని తొట్టికండ్రిగ పంచాయతీ జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ గురువారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లేఅవుట్‌లో తాగునీరు, విద్యుత్ సౌకర్య వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఏఈ దాము, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జయరాజ్, నాగరాజు ఉన్నారు.

కళింగ నర్తనునిగా గోపాలుడు


ఊరేగింపుగా వస్తున్న స్వామివారు

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా గురువారం రాత్రి కళింగ నర్తనునిగా శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి ప్రతి ఇంటి వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. బాణాసంచా వేడుకల నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవ నిర్వాహకులు డాక్టర్ నటరాజన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెరకు తోట దగ్ధం : రూ. 2లక్షల నష్టం


దగ్ధమైన చెరకు పంట

కార్వేటినగరం: మండల పరిధిలోని ఏబీసీ మామిడి కాయల జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం రాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమైంది. బాధితుని కథనం మేరకు.. ఎంఎం విలాసం పంచాయతీ మాకమాంబ విలాసపురం దళితవాడకు చెందిన మురళీ కృష్ణ (దివ్యాంగుడు) జ్యూస్ ఫ్యాక్టరీకి ఎదురుగా రెండు ఎకరాలు చెరకు సాగు చేశాడు. గురువారం రాత్రి విద్యుత్ స్తంభం నుంచి జంపర్ ఊడి తీగలపై పడడంతో నిప్పురవ్వలు ఎగశాయి. గాలులకు నిప్పురవ్వలు చెరకు తోటకు అంటుకున్నాయి. స్థానికులు పుత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసే లోపే చెరుకుతోట పూర్తిగా కాలి బూడిద అయ్యింది. పంట చేతికి అందే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రూ.రెండు లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు మురళీ కృష్ణ కన్నీరు మున్నీరైయ్యాడు

మద్యం మత్తులో కత్తితో దాడి


చికిత్స పొందుతున్న వెంకటేష్

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని కట్టకిందపల్లెలో మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుధవారం రాత్రి వెంకటేష్, అతని భార్య గొడవపడ్డారు. ఈ క్రమంలో తమిళనాడు నుంచి వీరి పక్కింటికి వచ్చిన సత్య అనే యువకుడు మద్యం మత్తులో వెంకటేష్‌పై కత్తితో దాడి చేశాడు. అనంతరం తమిళనాడుకు పరారయ్యాడు. స్థానికులు వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికే సంపూర్ణ పోషణ


పుత్తూరు: వైఎస్సార్ కిట్లు అందుకున్న బాలింతలు, గర్భిణులు

- కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం

పుత్తూరు రూరల్: తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తోందని తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి అన్నారు. గురువారం మండలంలోని కృష్ణసముద్రం సచివాలయ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనతను నిర్మూలించడానికే ప్రభుత్వం పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. అనంతరం గర్భిణులు, మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచ్ దయా, సీడీపీఓ పద్మజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పాలసముద్రంలో..

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ అన్నారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే శిశు మరణాలు జరగవన్నారు. పోషకాహారాన్ని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు దీప, సుమిత్ర పాల్గొన్నారు.

వేగవంతంగా 50 పడకల ఆస్పత్రి నిర్మాణం

- పనులను పరిశీలించిన ఎస్‌ఈ కృష్ణారెడ్డి


ఆస్పత్రి నమూనాను పరిశీలిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

కార్వేటినగరం: మండల కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం సీహెచ్‌సీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి స్థల దాత ఆర్బీ రామకృష్ణరాజును అభినందించారు. ఆస్పత్రి స్థలంలో నిరుపయోగంగా ఉన్న బావి, గోడలను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. కార్వేటినగరంతో పాటు పెనుమూరు మండలంలో రూ.13 కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. త్వరితగిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈయన వెంట ఈఈ లక్ష్మీపతిరెడ్డి, డీఈ సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి ఉన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): పనపాకం సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట రోడ్డులో గురువారం స్కూటర్‌ను గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ హిమబిందు కథనం మేరకు.. పాకాల మండలం దామలచెరువుకు చెందిన బాలాజీ, సుధాకర్ గురువారం సాయంత్రం బైక్‌లో తిరుపతి బయలుదేరారు. పనపాకం సమీపంలో లారీ ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలాజీ, సుధాకర్‌ను స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హిమబిందు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


దర్శకుడు గోపాల్, సంగీత దర్శకుడు కోటి

తిరుమల: శ్రీవారిని గురువారం నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ కోటి, సినీ డైరెక్టర్ బి.గోపాల్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

నింద్ర: పంట సాగులో ఆధునిక పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నగరి వ్యవసాయ సంయుక్త సంచాలకురాలు సౌభాగ్య లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని అగరంపేటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు, మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసిరాం, యామిని, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్లకు బానిస కావొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: ప్రజలెవ్వరూ దురలవాట్లకు బానిసకాకుండా, కుటుంబాలను కాపాడుకోవాలని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. వసంతాపురం, కమ్మతిమ్మాపల్లె, కుప్పిగానిపల్లె గ్రామాల్లో గురువారం సాయంత్రం గ్రామసభ నిర్వహించి సైబర్‌నేరాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యం అక్రమంగా రవాణా చేయడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. కొంతమంది వ్యక్తులు ఫోన్‌లు చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి నమ్మించి ఓటీపీ అడుగుతారని చెప్పారు. బ్యాంకు నుంచి ఎవరికీ ఫోన్‌లు రావని సైబర్‌గాళ్ల వద్ద చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కొంతమంది విద్యార్థులు గేమ్ ఆడి డబ్బులను పోగొట్టుకుంటున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న ఇళ్లల్లో బంగారు, నగదును ఎక్కువగా ఉంచకూడదన్నారు. అవసరమైతే గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసులో భద్రంగా దాచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో ఎవ్వరూ తగాదాలకు దిగకూడదని తల్లిదండ్రులు ఈ విషయంపై పిల్లలకు తెలియజేయాలన్నారు. యువత ఎక్కువగా గంజాయి, మద్యానికి అలవాటు పడుతున్నారని దీనిపై తల్లిదండ్రులే వారిని నివారించాలన్నారు.

